క్లుప్తంగా

ఈకేవైసీ నమోదు తప్పనిసరి

సైదాపురం: అన్నదాత సుఖీభవ పథకం కోసం రైతులు ఈకేవైసీ నమోదు తప్పని సరిగా చేసుకోవాలని ఏఓ హైమావతి కోరారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని తన కార్యాలయంలో రైతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్టీజీఎస్ వ్యాలిడేషన్ అనంతరం ఆధార్ నంబర్ల ప్రకారం మండలంలో అర్హత కలిగిన 5099 మంది రైతుల రికార్డులు మాత్రమే ఈకేవైసీ అయినట్లు తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే తమను సంప్రందించాలని కోరారు. అనంతరం ఖరీఫ్ పంటల సాగుపై రైతులతో చర్చించారు.

ప్రీస్కూల్‌పై అవగాహన



ఏకొల్లులో ప్రీస్కూల్‌పై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

దొరవారిసత్రం : మూడేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి బిడ్డను అంగన్‌వాడీ స్కూల్‌లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంకమ్మ తెలిపారు. ఏకొల్లు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ కార్యక్రమంపై సంబంధిత అధికారులు తల్లులకు అవగాహన కల్పించారు. ప్రీస్కూల్‌లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను బోధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు లీలమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ ఉత్సవాలు

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరు గ్రామంలో మంగళవారం గంగమ్మతల్లి ఉత్సవాలను స్థానికులు వైభవంగా నిర్వహించారు. డప్పుల మోతల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో హోమపూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తిని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగిస్తూ అమ్మవారికి ఎదురు కుంభాలు సమర్పించారు.

కిలివేటితో భేటీ



కిలివేటి సంజీవయ్యను మర్యాద పూర్వకంగా కలిసిన మొయిళ్ల గౌరి దంపతులు

నాయుడుపేటటౌన్ : సూళ్లూరుపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్యను ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, సురేష్ రెడ్డి దంపతులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా శాలువలు కప్పి పూల మొక్కలను అందించి సత్కరించారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని తుమ్మూరు స్వర్ణముఖి నది వద్ద నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. స్వర్ణముఖి నది వద్ద నుంచి నంబర్‌ప్లేట్ లేని ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండడాన్ని గుర్తించారు. ట్రాక్టర్లు ఎవరివి ? ఇసుకను ఎక్కడికి తరలిస్తున్నారు? తదితర విషయాలను పోలీసులు విచారిస్తున్నారు.


యోగాతో ఆరోగ్యం



యోగాపై శిక్షణ ఇస్తున్న శిక్షకులు నరేష్

చిల్లకూరు: యోగాతో ఆరోగ్యం పొందవచ్చని యోగా శిక్షకులు నరేష్ తెలిపారు. చిల్లకూరులోని విద్యానికేతన్ కళాశాలలో యోగా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ఒత్తిడితో పాటుగా శరీరాన్ని ఉల్లాసంగా ఉంచుకునేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హార్టు ఫుల్‌నెస్ సంస్థ సభ్యులు శశికళ, రజినీ, మురళీకృష్ణారెడ్డి, లక్ష్మీజాఫర్, ఆలీ, రజనీకాంత్, బాబురావు, అనసూయమ్మ, సంగీతమ్మ, బన్నీ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ నరసింహంకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

రాపూరు: మండలంలోని జోరేపల్లి అక్కమాంబపురంలో మేత పోరంబోకు భూములను కొందరు ఆక్రమించుకుంటున్నారని గ్రామానికి చెందిన పలువురు మంగళవారం తహసీల్దార్ నరసింహంకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 67లో సుమారు 70 ఎకరాలు ప్రభుత్వ మేత పోరంబోకు భూమి ఉందన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది ఆ భూమిని చదును చేసి ఆక్రమించుకుంటున్నారని విన్నవించారు. గ్రామంలో భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిని పంచాలని కోరారు.

విలీనం కాదు అన్యాయం

- పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- దూరంగా ఉన్న స్కూళ్లకు పిల్లలను పంపలేమంటూ తల్లిదండ్రుల ఆగ్రహం
- ఏదైనా జరిగితే ఎవరిది బాధ్యత అని ఫైర్
- దొరవారిసత్రం, డక్కిలిలో స్కూళ్ల మూతపై ఆగ్రహం



వెలికల్లు ఎస్సీ కాలనీ స్కూల్‌ను మార్చవద్దంటూ ఎంఈఓకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

దొరవారిసత్రం : 'ప్రభుత్వ స్కూళ్లను క్లస్టర్ పేరుతో విలీనం చేయడం సరికాదని.. మా పిల్లలను దూరంలో ఉన్న స్కూళ్లకు పంపలేమం' అంటూ దొరవారిసత్రం ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం పిల్లలతో కలిసి తల్లిదండ్రులు నిరసనకు దిగారు. స్థానికంగా 10 మంది విద్యార్థులు ఉండగా వీరిని సుమారు రెండున్నర కిలోమీటర్లు దూరంలో ఉన్న ఏకొల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కలపడం సరికాదని తల్లిదండ్రులు మండిపడ్డారు. ఈవిషయంపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని తమ ఊర్లోనే పాఠశాల ఉండేలా చూడాలని కోరారు. అదేవిధంగా కుప్పారెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను ఏకొల్లులో కలపడం వల్ల నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంది. ఎస్‌ఎం అగ్రహారం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులను అక్కరపాక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కలపడం వల్ల మూడు కిలోమీటర్లు పిల్లలు ఎలా వెళ్తారని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పిల్లల చదువుల విషయంలో కూటమి ప్రభుత్వం ధోరణి మార్చుకోవాలని, లేదంటే పేద విద్యార్థులకు విద్య అందకుండా పోతుందని వాపోయారు.

ఎంఈఓతో వాగ్వివాదం

డక్కిలి: మా పాఠశాల..మా ఊరులోనే ఉండాలి.. ఈ స్కూల్‌ను పక్క ఊరు పాఠశాలలో విలీనం చేయవద్దు అంటూ వెలికల్లు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామ సర్పంచ్ మచ్చల వెంకటరమణయ్యతో కలిసి మంగళవారం ఎంఈఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెలికల్లు ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలను విలీనం చేయడం వల్ల ఇక్కడ చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులు మార్లగుంట స్కూల్‌కు ఎలా వెళ్తారంటూ ఎంఈఓతో వాగ్వివాదానికి దిగారు. ప్రతి రోజూ నిద్ర లేచి తాము కూలి పనులకు వెళ్తామని.. ఇప్పుడు స్కూల్‌ను మూసేసి పిల్లలను వేరే ఊర్లో ఉన్న స్కూల్లోకి కలిపితే ఆటోల్లో ఎలా పంపాలని మండిపడ్డారు. విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. తమ పాఠశాల విలీనం ఆపకపోతే తమ పిల్లలను స్కూల్‌కు పంపలేమని తేల్చి చెప్పారు. అలాగే వెలికల్లు మెయిన్ ప్రాథమిక పాఠశాల, మాధవయ్యపాళెం రోడ్డు సెంటరులో ఉన్న పాఠశాలలో చదువుకునే పిల్లలను కూడా మార్లగుంట స్కూల్‌కు పంపాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో ఉన్న స్కూల్‌ను ఎలా మార్చుతారని ఎంఈఓను నిలదీశారు. స్పందించిన ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసిందని తప్పకుండా అక్కడికి రావాల్సిందేనని సమాధానం చెప్పారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని విలీనం నిలిపేసి యథావిధిగా పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

సమ్మె నోటీసు అందజేత



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న సీఐటీయూ నాయకులు, ఇంజినీరింగ్ విభాగ కార్మికులు

నాయుడుపేటటౌన్ : మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు స్థానిక ఇంజినీరింగ్ విభాగ కార్మికులు మంగళవారం సమ్మె నోటీసు అందించారు. సీఐటీయూ నాయకుల సారథ్యంలో కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కాంచాలని కోరుతూ సమ్మె చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి ముందస్తుగా నోటీసు అందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు చెంగయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగ కార్మికులకు జీవో నంబరు 36 ప్రకారం జీతాలు పెంచి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఎలక్ట్రీషియన్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

చిల్లకూరు : గూడూరులో తాగునీటి సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే కండలేరు డ్యాం నుంచి వేములపాళెంలోని వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంట్ వరకు వచ్చే పైపులైన్‌కు మూడు చోట్ల లీకులు ఏర్పడ్డాయన్నారు. వాటికి మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు.

కాలువల్లో గంగ పరవళ్లు



సైదాపురం చెరువులకు 2బీ కెనాల్ ద్వారా నీరు ప్రవహిస్తున్న దృశ్యం

సైదాపురం: కండలేరు 2ఏ, 2బీ బ్రాంచ్ కెనాళ్లకు సాగునీరు విడుదల చేశారు. రైతుల అవసరాలను గుర్తించిన ఈ ఏడాది ఎడగారు పంటలకు సైదాపురం మండలానికి వచ్చే ప్రధాన కాలువలైన 2ఏ, 2బీ కెనాళ్లకు నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలోని తుమ్మల తలుపూరు, కలిచేడు, ఓరుపల్లి, మలిచేడు, కట్టబడిపల్లి, దేవరవేమూరు, తురిమెర్ల, ఊటుకూరు, గిద్దలూరు, జోగిపల్లి, పోక్కందల, ఆదూరుపల్లి, మొలకలపూండ్ల, సైదాపురం, రామసాగరం, పెరుమాళ్లపాడు, పరసారెడ్డిపల్లి చెరువులకు 2ఏ బ్రాంచి కెనాల్ ద్వారా సాగు నీరు వస్తోంది. దీంతో సుమారు 16వేల మాగాణి భూములకు సాగునీరు అందనుండడంతో రైతులు ఆనందంగా పంటల సాగు చేపట్టనున్నారు. అలాగే 2బీ కాలువ ద్వారా చీకవోలు, అన్నంరాజుపల్లి, రాజులెరుగుంటపాళెం, పోతేగుంట, చాగణం, రాగనరామాపురం, తిప్పిరెడ్డిపల్లి, లింగసముద్రం, కమ్మవారిపల్లి, గంగదేవిపల్లి, అనంతమడుగు, పాలూరు, తోకలపూడి, వేములచేడు గ్రామాల్లో సుమారు 14,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

షార్‌లో యోగా దినోత్సవం



షార్ కేంద్రంలో యోగాసనాలు చేస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట : సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) లో స్పేస్ సెంట్రల్ స్కూల్ మైదానంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం షార్ ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు, సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బంది, విద్యార్థులు స్థానిక ప్ర భుత్వ అధికారులతో కలిసి యోగాసనాలు వేశారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, షార్‌లోని సీనియర్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, స్థానిక ఆర్డీఓ కిరణ్మయి ఆధ్వర్యంలో సుమారు 1300 మంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం షార్‌లోని ఎంఆర్ కురూప్ ఆడిటోరియంలో ప్రముఖ ప్రకృతి వైద్యులు డాక్టర్ రామచంద్రరావు ప్రకృతి జీవన విధానం అనే అంశంపై ఓ ప్రత్యేక సదస్సు నిర్వహించారు.

నేడు పుస్తకావిష్కరణ



సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి

చిట్టమూరు: మండల పరిధిలోని కొత్తగుంట గ్రామంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద బుధవారం జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ మేరిగ మురళీధర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వెండి కవచాలు వితరణ



చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి వెండి కవచాలను అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట : పట్టణంలో వెలసిన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి తమిళనాడులోని పూలంబేడు గ్రామానికి చెందిన శ్రీనివాసన్ కుటుంబసభ్యులు 5 కేజీల బరువు కలిగిన రెండు వెండి కవచాలను బుధవారం రాత్రి ఆలయ ఏసీఅండ్ఈఓ ప్రసన్నలక్ష్మీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రత్యేక దర్శనం చేయించారు. అలాగే అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

గిరిజనుల అభివృద్ధికి చర్యలు



విద్యా సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే

డక్కిలి: గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. డక్కిలి పంచాయతీ కందలవారిపల్లి గిరిజన కాలనీలో మంగళవారం ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులు సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కాలనీలో కావాల్సిన తాగునీరు, అంతర్గత రోడ్లు, వీధిలైట్లు, విద్యుత్ సౌకర్యం వంటి మౌళిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కందలవారిపల్లిలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను కూడా సర్వే చేయిస్తామన్నారు. అనంతరం కందలవారిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు, ఎంపీడీఓ గుణశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజు, ఏపీఎం జమునారాణి, ఏఓ శిరిషా, ట్రాన్స్‌కో ఏఈఈ అశోక్, పశువైద్యాధికారి కిషోర్, పలు శాఖల అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం





మాట్లాడుతున్న కమిషనర్ ఫజులుల్లా, చైర్ పర్సన్ దీపిక, సమావేశానికి హాజరైన వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

నాయుడుపేటటౌన్ : మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ. 5 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. నాయుడుపేట పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం చైర్‌పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కమిషనర్ షేక్ ఫజులుల్లా సారథ్యంలో పురపాలక సంఘ సమావేశం జరిగింది. అజెండాలో రూపొందించిన 23 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో పెట్టిన మరో 4 అంశాల వివరాలను కమిషనర్ చదివి వినిపించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు కలెక్టర్ నిధులతో పట్టణంలో డివైడర్ల మధ్య దుకాణాలు పెట్టుకున్న నక్కలోళ్లకు పీవీఎస్ ఆస్పత్రి సమీపంలో రహదారిపై దుకాణాల ఏర్పాటుకు షెడ్ల నిర్మాణం, గోమతి సర్కిల్ నుంచి పిచ్చిరెడ్డి తోపు వరకు సెంట్రల్ లైటింగ్, 15వ ఆర్థిక సంఘం, పురపాలక సంఘ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. కౌన్సిలర్లు ధారా రవి, పాలేటి నాగార్జున, కావేరిపాకం అశోక్‌కుమార్, షేక్ షబ్బీర్, మున్సిపల్ డీఈ శ్రీనివాసులు, టీపీఓ బాలసుబ్రహ్మణ్యం, మేనేజర్ పూరుకుందామ్మ, ఏఈ చంద్ర, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్‌కు సంఘీభావంగా ర్యాలీ



ర్యాలీలో సీపీఎం నాయకులు

చిల్లకూరు: పాలస్తీనా, ఇరాన్‌పై అమెరికా అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే ఆపాలంటూ సీపీఎం నాయకులు సంఘీభావ ర్యాలీ చేపట్టారు. గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ ప్రాంతంలో మంగళవారం చేపట్టిన ర్యాలీలో సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఇరాన్ మీద ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో అనేక మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ఈ మారణ కాండను ఆపేందుకు ప్రపంచ దేశాలు కలుగ జేసుకుని అమెరికా మద్దత్తు ఉప సంహరించేలా చూడాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

చెట్లు.. ఫెన్సింగ్ రాళ్లు పీకేశారు



తహశీల్దార్ నరిసింహంకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

రాపూరు: మండలంలోని గోనుపల్లిలోని గొల్లబోయిన దేవస్థానం ఎదురుగా ఉన్న భూమిలోని నిమ్మచెట్లను, ఫెన్సింగ్ రాళ్లను పీకివేశారని గాలి శంకరమ్మ, రమణయ్య మంగళవారం తహసీల్దార్ నరసింహంకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గోనుపల్లి సమీపంలోని సర్వేనంబర్ 382-2లో 2.12 ఎకరాలు, సర్వేనంబర్ 226/1ఏ, 2ఏలో 0.36 సెంట్ల భూమి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిందన్నారు. అయితే తమ భూమిలో కొద్దిరోజుల క్రితం పొలం చుట్టూ ఫెన్సింగ్ వేసి, నిమ్మమొక్కలు పెంచుతున్నట్లు చెప్పారు. అయితే సోమవారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, కొంతమంది బయట వ్యక్తులతో కలసి ఫెన్సింగ్‌రాళ్లు విరగ్గొట్టి, నిమ్మ చెట్లను పీకేశారని వాపోయారు. సుమారు రూ.2 లక్షలు ఖర్చుచేశామని, వాటిని ధ్వంసం చేశారని ఆరోపించారు. అధికారులే తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం రాపూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

స్కూళ్ల విలీనంపై అభ్యంతరం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ మన్నెం శీనయ్య

చిల్లకూరు : ఒక పంచాయతీలో ఉన్న పాఠశాలలను రెండు లేదా మూడు కి.మీ. దూరంలోని పాఠశాలల్లో విలీనం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే విద్యాశాఖ అధికారులు సైలెంట్‌గా ఉండి.. నేడు పాఠశాలల విలీనానికి ఉపక్రమించడం ఏమిటని ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ మన్నెం శీనయ్య మాట్లాడుతూ జిల్లా పరిషత్, మండల పరిషత్ ద్వారా వచ్చే నిధులతో ప్రజా సమస్యలను పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ గోపి, వైస్ ఎంపీపీలు వేమారెడ్డి కుమార్‌స్వామిరెడ్డి, పోలుబోయిన చెంగయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

చిట్టమూరు: మండల వ్యవసాయాధికారిగా నిరంజన్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిట్టమూరులో ఏఓగా పనిచేస్తున్న సుచేంద్రప్రసాద్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నిరంజన్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు.

వీఆర్ఏల వినతి

వాకాడు: అర్హత ఉన్న వీఆర్ఏలను గుర్తించి వారికి పదోన్నతి కల్పించాలని మంగళవారం మండలంలోని వీఆర్ఏలు తహసీల్దార్ రామయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఆర్ఏ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎంతో కాలంగా వీఆర్ఏలుగా పని చేస్తున్న వారిని గుర్తించి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు

అధికారం చేపట్టిన ఏడాదిలోనే రాష్ట్రాన్ని చంద్రబాబు భ్రష్టు పట్టించారని, కూటమి నేతలు రెడ్‌బుక్ పేరుతో అరాచకం సృష్టిస్తున్నారని ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు తెలిపారు. మంగళవారం గూడూరు, వెంకటగిరి, సూళ్లూరు పేట నియోజకవర్గాల్లోని మండలాల్లో 'జగన్ అంటే నమ్మకం-బాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. – ఓజిలి/ కోట/ దొరవారిసత్రం/ గూడూరురూరల్/ చిల్లకూరు /సూళ్లూరుపేట రూరల్/ తడ/పెళ్లకూరు



గూడూరురూరల్‌లో..



చిల్లకూరులో..





కోటక్రాస్‌రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద పుస్తకం ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, దీవీ సత్రంలో పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు







కరపత్రాలను విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, ఓజిలి: పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు